నగరంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - కడప అర్బన్

పారిశుధ్య ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, నగరపాలక సిబ్బందితో కలిసి కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి రైతు బజార్, రాధాకృష్ణనగర్, మున్సిపల్ గ్రౌండ్ ప్రాంతాల్లో పర్యటించారు. శుక్రవారం రైతు బజార్‌లో శుభ్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వద్దని, ప్రజలు ఎక్కువగా సంచరించే ఈ ప్రాంతంలో చెత్తను తక్షణం శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 25వ డివిజన్ రాధాకృష్ణ నగర్ లో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. పింఛన్ల పంపిణీలో అలసత్వం తగదని సచివాలయ, నగరపాలక సిబ్బందికి ఆదేశించారు. అనంతరం మున్సిపల్ స్టేడియం ప్రాంతాన్ని సందర్శించిన కమిషనర్, అక్కడ చేపట్టిన పనులను సమీక్షించారు. ఆర్మీ రిక్రూట్మెంట్ కోసం చేపడుతున్న పనులు సమయానికి పూర్తిచేసేలా ఇంజినీరింగ్ విభాగం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

కరువు కోరలు!

కడప, అన్నమయ్య జిల్లాల్లో కరువు కోరలు చాచింది. 2024 ఖరీఫ్ సీజన్‌లో క్షామం విలయతాండవం చేసింది. ఫలితంగా అన్నమయ్య జిల్లాలో 48.47 శాతం విస్తీర్ణం సాగుకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలో 36 మండలాల్లో 10 మండలాల్లో, అన్నమయ్య జిల్లాలో 23 మండలాల్లో కరువు కరాళ నృత్యం చేసింది. ఇందులోని 19 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపు కుంది. కడప జిల్లాలో 10 మండలాల్లో వర్షపాత లేమి, పంటల సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ గాలికి వదిలేసింది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల గ్రామాలున్నప్పటికీ వందలాది గ్రామాలకు తాగునీటి ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాగు దగ్గుదల, తాగునీటి కటకటల నేపథ్యం ఫలితంగా గ్రామాల్లో విజయ దశమి, దీపావళి వంటి పండుగలకూ కన్నీటి వెతలు తప్పలేదు.

- అన్నమయ్యలో 48.47 శాతమే సాగు
- కడప జిల్లాలోనూ మూడింట వర్షపాత లోటు
- పి.అనంతపురంలో మూడ్రోజులకోసారే తాగునీరు
- రూ.750 చొప్పన ట్యాంకర్ కొనుగోలు
- పర్వదిన వేడుకలపైనా కరువు పంజా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలను కరువు కబళించింది. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో అన్నమయ్య జిల్లాలో 1,61,426 వేల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా 77,763 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం కరువు తీవ్రతకు అద్దం పడుతోంది. 48.47 శాతం మాత్రమే పంటలు సాగు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఖరీఫ్ సీజన్ ఆరం భం నుంచి కరువు కాటేసింది. అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట రాయచోటి నియోజ కవర్గాలను మినహాయిస్తే మిగిలిన ఐదు నియోజకవర్గాల పరిధిలోని మండలాలన్నీ వర్షపాత లేమిని ఎదు ర్కొనడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలో 13.28 లక్షల ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణాన్ని కలిగి ఉంది. 3.45 లక్షల ఎకరాలు కాలువలు, బోర్ల కింద, 99 వేల ఎకరాలు చెరువుల కింద సాగవుతోంది. 5.94 లక్షల ఎకరాలు వర్షాధారంపై ఆధారపడి ఉంది. 2024 ఖరీఫ్‌లో జూన్ ముందస్తుగా వర్షాలు కురవడంతో 1.65,485 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. 89.11 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది.

చక్రాయపేట మండలం ఏండ్లవాండ్లపల్లెలో ఎండిపోయిన వేరుశనగ పంటను చూస్తున్న రైతులు

ముంచిన లోటు!

అన్నమయ్య జిల్లాలో 743.7 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది.346.6 మి.మీ మాత్రమే వర్షపాతం నమోదైంది. మైనస్ 7.5 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం పంటల సాగుపై ప్రభావం చూపించింది. జిల్లాలోని 30 మండలాల్లో 11 మండల ప్రాంతాల్లో రెండుసార్లు చొప్పున వెరసి 39 డ్రైస్పెల్స్ నమోదు కావడం గమనార్హం. మూడు మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, 13 మండలాల్లో సాధారణ, 10 మండలాల్లో వర్షపాత లేమి నమోదు కావడం ఆందోళన కలిగించింది. కడప జిల్లాలోనూ కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బద్వేల్, పెద్దముడియం, తొండూరు, వేంపల్లి, అట్లూరు, సిద్ధవటం, ఒంటిమిట్ట చక్రాయపేట మండలాల్లో లోటు వర్షపాతం ఆందోళన కలిగిస్తోంది. పెద్దముడియం మండలంలో గరిష్టంగా మైనస్ 44.1 శాతం, కనిష్టంగా పోరు మామిళ్లలో 24.6 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

దాహం కేకలు

అన్నమయ్య జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని లక్కిరెడ్డిపల్లి మండలంలో మరింత లోతుగా పడిపోయినట్లు కనిపిస్తోంది. లక్కిరెడ్డిపల్లి మండలంలోని పి.అనంతపురం దళితవాడలో మూడు రోజులకు ఒక సారి తాగునీరు సరఫరా అవుతోంది. పాత సబ్‌మెర్సిబుల్ మోటారు నుంచి వచ్చే సన్నటి నీటి ధార గ్రామానికి సరిపోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చేసేదేమీ లేకపోవడంతో రూ.750 చొప్పున ట్యాంకరు తెప్పించుకుని గొంతు తడుపుకుంటుండడం గమనార్హం. కడప జిల్లాలోనూ కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బద్వేల్, పెద్దముడియం, తొండూరు, వేంపల్లి, అట్లూరు, సిద్ధవటం, ఒంటిమిట్ట చక్రాయపేట వంటి మండలాలో వందలాది మీటర్లలోతు బోర్లు వేసినప్పటికీ గంగజాడ కనిపించడం లేదు. జిల్లాలో ఏప్రిల్, మేల్లో సుమారు 500 గ్రామాలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే అవ కాశం ఉందని అంచనా.

తాగునీటిని సరఫరా చేయండి

పి.అనంతపురం దళితవాడకు సకాలంలో తాగునీటిని అందించండి. మూడ్రోజుల వరకు ఆగాల్సి వస్తోంది. తాగునీటి కోసం లక్కిరెడ్డిపల్లి నుంచి రూ.750 చొప్పున చెల్లించి ట్యాంకరు తెప్పించుకుని నీళ్లు తాగుతున్నాం.

- కె.వెంకటరమణ, స్థానికుడు, పి.అనంతపురం, లక్కిరెడ్డిపల్లి.

అప్పులు తప్పడం లేదు

నాకు ఐదెకరాలు ఉంది. మూడెకరాలు మామిడి, రెండెకరాలు వేరుశనగ సాగు చేశా. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ దిగుబడులు నామమాత్రం. వర్షాలు లేకపోవడంతో అంతంత మాత్రమే పంట చేతికి వచ్చింది. పెట్టుబడి సొమ్ము దక్కడమూ గగనంగా మారింది.

- నంది బాబు, రైతు, నందివాండ్లపల్లి, లక్కిరెడ్డిపల్లి.

'దీపం-2'ను సద్వినియోగం చేసుకోవాలి

- ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం - 2 పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నానుబాల ఫంక్షన్ హాల్‌లో సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఏడాదికి మూడు సిలిండర్లు మహిళలు ఉచితంగా పొందవచ్చన్నారు. వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు ఉచిత గ్యాస్ కొరకు లబ్ధిదారులు నమోదు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలిపారు. టిడిపి ఇన్‌ఛార్జి సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతకు దీపం పథకం ఒక ఉదాహరణ అన్నారు. అనంతరం లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి, అధికారులు, కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు. **కమలాపురం టౌన్ :** ఉచిత గ్యాస్ సిలిండర్లు దీపం - 2 పథకాన్ని మండలంలో భారత్ గ్యాస్ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తానరసింహారెడ్డి కడప ఆర్‌డిఒతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. మండలంలో సుమారు 10660 మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ పంపిణీ చేయనున్నామని పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. బియ్యం కార్డు ఉన్న ప్రతి వినియోగదారుడు అర్హుడేనని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, మండల కన్వీనర్ రాఘవరెడ్డి ఖాధర్‌బాష, వాసుదేవరెడ్డి, పాలగిరి సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, దివాకర్ రెడ్డి, నాగిరెడ్డి, ప్రసాద్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి,సుబ్బారెడ్డిపాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలోని నారాయణ పాఠశాల సమీపంలో ఉచిత గ్యాస్ పంపిణీ పథకాన్ని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆర్‌డిఒ భాను శ్రీ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో బిటెక్ రవి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందన్నారు. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారులకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచిత గ్యాస్ పంపిణీ చేస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు రూ. 5 లక్షల నుంచి రూ. పది లక్షల వరకు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ నూర్ అహ్మద్, టిడిపి నాయకులు నల్లగారి భాస్కర్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా ఉన్నారు.

మహిళకు దీపం-2 ద్వారా ఉచిత సిలిండర్ పత్రం అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్, ఎమ్మెల్యే

న్యాయం చేయాలంటూ

ప్రియుడి ఇంటి ముందు యువతి ధర్నా

చేయిచేసుకున్న యువకుడి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆరేళ్లుగా ప్రేమించి ప్రేమ వివాహం చేసుకున్న తరువాత 'నువ్వు నాకు వద్దు' అని ప్రియుడు మోసం చేయడంతో తనకు న్యాయం చేయాలంటూ ఆ యువకుడి ఇంటి ముందు ఆమె ధర్నాకు దిగింది. కొంత సేపు యువకుడి కుటుంబ సభ్యులకు ఆమెకు వాగ్వివాదం చేసుకుంది. ఒకానొక సందర్భంలో వారు ఆమెపై చెయ్యి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ యువతిని సర్దిజెప్పి స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని అలవలపాడుకు చెందిన అంకాలమ్మ, వేంపల్లె గౌరినగర్‌కు చెందిన పసుపులేటి వెంకట గురునాథ్ ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గురునాథ్ బిటెక్, అంకాలమ్మ డిగ్రీ పూర్తి చేశారు. వీరిద్దరూ రెండేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నారు. ఇటీవల యువతికి పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో ఆమె ప్రియుడికి విషయం చెప్పింది. ఇద్దరు కలిసి గతనెల 26న ఇంటి నుంచి వెళ్లి బద్వేల్‌లోని డ్రాకాపేట శివాలయంలో వివాహం చేసుకున్నారు. తరువాత వారు పోలీస్‌స్టేషన్‌లో తాము వివాహం చేసుకున్నట్లు పోలీసులకు చెప్పారు. పోలీసులు వీరిద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. తరువాత గురునాథ్ తల్లిదండ్రులు ఆమెను ఇంటివద్దకు రావొద్దని చెప్పడంతో తన పిన్ని ఇంటికి వెళ్లింది. మూడు రోజుల కిందట యువకుడు బట్టల కోసం డబ్బులు అడిగితే రూ.10 వేలు డబ్బులు, బైకు యువతి బంధువులు ఇచ్చారు. అతను తిరిగి రాకపోవడంతో అంకాలమ్మ బంధువులతో కలిసి పోలీస్టేషన్‌వద్దకు వెళ్లారు. పోలీసులు గురునాథ్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించి మూడు రోజుల తరువాత రావాలని చెప్పి ఇంటికి పంపించారు. గురునాథ్ ఇంక రాడేమోనని గ్రహించిన యువతని ప్రియుడి ఇంటిముందు శుక్రవారం ధర్నాకు దిగింది. ఆ సమయంలో అతని బంధువులకు, ఆమెకు వాగ్వాదం చేసుకుంది. పైగా ఆమెపై గురునాథ్ బంధువులు దాడికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తనకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. యువకుడు మాత్రం స్టేషన్‌కు రాకపోవడంతో తన భర్తను తనతో పంపించాలంటూ పట్టుబడింది.

యువతిపై దాడి చేస్తున్న యువకుడి కుటుంబ సభ్యులు

ప్రియుడి ఇంటి ముందు ధర్నా చేస్తున్న అంకాలమ్మ

అసాంఘిక కార్యకలాపాలపై దాడులు ముమ్మరం : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు నేరాలపై అక్టోబర్‌లో ముమ్మరంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి విక్రయాలు, గ్యాంబ్లింగ్, మట్కా నిర్వాహకులపై దాడులు, ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యంపై దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై ఎం.వి యాక్ట్ కేసులు నమోదు చేసి జరిమానా విధించారని తెలిపారు. 2384.71 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని 133 కేసుల్లో 139 మందిని అరెస్టు చేశామన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 4480 మందిపై ఎం.వి యాక్ట్ కేసులు నమోదు చేసి వారికి మొత్తం రూ. 6,04,800 జరిమానా విధించామన్నారు. అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పోలీస్ శాఖకు ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100 కు తెలియచేయాలని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

హోరాహోరీగా అండర్-14 క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కడప

ఎసిఎ అండర్ -14 గ్రూప్ -బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంటులో భాగంగా శుక్రవారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కృష్ణ, శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన కృష్ణ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 60.1 ఓవర్లలో 115 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రిత్విక్ 29 (నాటౌట్), హర్ష 25 పరుగులు చేశారు. శ్రీకాకుళం జట్టులోని సాత్విక్ 3, శ్రీ యోజిత్ 2, సాయి ఆదిత్య 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. ఆ జట్టులోని జోగేంద్ర 33 (నాటౌట్), నేత కిరణ్ 30 పరుగులు చేశారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - వల్లూరు

విద్యార్థులకు సామాజిక భద్రత అంశాల పట్ల అవగాహన తప్పనిసరిగా ఉండాలని వల్లూరు ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కె. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సామాజిక అంశాలపై సర్వే పోటీని పాఠశాలలో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ సామాజిక అంశాల పట్ల సర్వే చేయించడం వల్ల విద్యార్థుల్లో పరిసరాలపై అవగాహన కలుగుతుంది. మన ముందు కనిపిస్తున్న సమస్యలు వాటి నిర్మూలన బ్యాంకులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లభించు సేవలు మొదలైన విషయాలపై అవగాహన పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్యాంసుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో నిరాశ

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున

ప్రజాశక్తి - కడప అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐఆర్, మెరుగైన పిఆర్‌సి ప్రకటిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని, ఇంత వరకు అమలు చేయకపోవడం పట్ల ఉద్యోగ ఉపాధ్యాయుల్లో తీవ్ర నిరాశ నెలకొని ఉందని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున అన్నారు. శుక్రవారం ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 117వ జీవో రద్దు చేసిన విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలలో మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని, మెరుగైన పిఆర్‌సి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో దీపావళికి డిఏ ప్రకటించడం, మన రాష్ట్రంలో పెండింగ్ డిఎల పట్ల ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో నిరాశ నిస్పృహ నెలకుని ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యల పై స్పందించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి. శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.సుదర్శన్ బాబు, మేంద్రగుత్తి గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేకల శివార్జున

పేదలకే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికీ పెన్షన్ కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగిస్తూ పేదలకే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. శుక్రవారం పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటిమంత్రి లోకేష్, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో దీపావళి వెలుగులో ఉచిత గ్యాస్ ప్రారంభించారని పేర్కొన్నారు. ఇందుకు రూ.895 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. రాష్ట్రం లో 175 అన్నా క్యాంటీన్ల ద్వారా దాదాపు రూ. 2లక్షల మంది పేదల కడుపునింపుతున్నారని చెప్పారు. రాష్ట్ర మంతటా ప్రతి గ్రామంలో పల్లె పండుగ ద్వారా రూ.4500 కోట్ల తో అభివృద్ధి పనులు ప్రారంభించి ప్రజలకు అండగా ప్రభుత్వం ఉందన్నారు. అవసరమైన వారికే ఉచిత ఇసుకను అందజేస్తున్నారని చెప్పారు.



పింఛను పంపిణీ చేస్తున్న మన్నూరు అక్బర్

4 నుంచి బిఇడి 2, 4 సెమిస్టర్ల పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని బిఇడి కళాశాలల 2,4 సెమిస్టర్ల విద్యార్థులకు ఈనెల 4 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల కోసం జిల్లాలోని16 కేంద్రాలను సిద్ధం చేశామని, 16,900 మంది విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మార్గదర్శకం మేరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు అబ్జర్వర్లతో పాటు హైపవర్ కమిటీలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

కడప 'ఉక్కు' సాధనే లక్ష్యంగా పోరాటాలు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాబోవు రోజులలో కడప ఉక్కు సాధనే లక్ష్యంగా యువతను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాలశివకుమార్ తెలిపారు. డివైఎఫ్ఐ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ముద్దనూరు రోడ్డులో డివైఎఫ్ఐ స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు. ముఖ్యమంత్రులు మారు తున్నారు కానీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణ జరగడం లేదన్నారు. ముఖ్యమంత్రులు వేసిన శిలా ఫలకాలు సమాధి రాళ్ళు లాగా వెక్కిరిస్తున్నాయన్నారు. యువతకు ఉద్యోగాలు కలగాలంటే, రాయలసీమ అభివృద్ధి చెందాలంటే కడప ఉక్కు పరిశ్రమే ఏకైక మార్గం అన్నారు. రాబోవు రోజులలో అమరుల త్యాగాల స్ఫూర్తితో కడప ఉక్కు కోసం నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం డివైఎఫ్ ఐ జెండా చేతపట్టి పోరాటాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, తులసిశ్వర్ యాదవ్, పట్టణ నాయకులు కృష్ణా రెడ్డి, సురేష్, వంశి, సూరి, రాఘవ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

జగన్‌కు రుణపడి ఉంటాం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రేమోన్మాది చేతిలో బలైన దస్తగిరమ్మ ఘటనపై మాజీ సీఎం జగన్ స్పందించిన తీరు హర్షణీయమని, ఆయనకు రుణపడి ఉంటామని నూర్ బాష్ దూదేకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా అన్నారు. శుక్రవారం ఎంబిసి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దస్తగిరమ్మను ప్రేమోన్మాది విగ్నేష్ పాశవికంగా హతవార్చిన ఘటనపై వైసిపి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ మాజీ సీఎం అంజాద్ బాషా, బద్వేల్ ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి స్పందించి దస్తగిరమ్మ కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యాన్ని, భరోసా కల్పించారని పేర్కొన్నారు. వైసిపి అధినేత వై.ఎస్.జగన్ స్వయంగా మృతురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేశారన్నారు. ప్రేమోన్మాది విగ్నేష్ ను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. సమావేశం లో జిల్లా అధ్యక్షులు పగిడాలా పెద్దన్న, జిల్లా నాయకులు నాగూరు కుళాయిప్ప, అబ్దుల్ సుభాన్, కమాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

పోష్ చట్టం ద్వారా ఫిర్యాదు చేయవచ్చు : జడ్జి

ప్రజాశక్తి - కడప : మహిళలు లైంగిక వేధింపులకు గురైనప్పుడు పోష్ చట్టం 2013 ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పోష్ చట్టం 2013పై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి, లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల నివారణ, పరిష్కారానికి చట్టం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ సంజీవప్ప మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు సెలవులు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, సెలవులు ఇవ్వాలని, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజామణి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరం లోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఆశాలపై సచివాలయం ఉద్యోగుల వేధిం పులు అరికట్టాలన్నారు. ఆశా కార్యకర్తలతో పారిశుధ్య పనులు చేయించడం సబబు కాదన్నారు. ఫీల్డ్ సర్వే పనులను ఎఎన్ఎంలు చేయకుండా ఆశా వర్కర్లతో చేయిస్తూ వారిపైనా పెత్తనం చేస్తున్నారని వాపోయారు. ఆశా వర్కర్లపై పనిభారాన్ని తగ్గించాలని, 24 గంటలు ఆశా పనిలోనే ఉండాల్సిన వస్తోందని చెప్పారు. ప్రభుత్వ సెలవులు కార్మిక చట్టాలలో బడి 36 రోజులు పని చేస్తే నాలుగు ఆదివారాలు క్యాజువల్ సెలవులు ఇవ్వాలి, ఎక్కడ కూడా అమలు కావట్లేదని తెలిపారు. రిటైర్మెంట్, గ్రూప్ న్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలుచేయాలని, ఆశా నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించాలని, ప్రభుత్వమే నియామకాలు జరపాలని పేర్కొన్నారు. రిటైర్మెంట్ కాలాన్ని 62 ఏళ్ళకు పెంచాలని, బెనిఫిట్స్ కల్పించిన తరువాతే రిటైర్మెంట్ చేయాలని యూనియన్‌గా తాము కోరుతున్నామని చెప్పారు. 18 సంవత్సరాలుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వీరిని కార్మికులుగా గుర్తించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవ శాత్తు, అనారోగ్యంతో చాలా మంది ఆశా వర్కర్లు అర్ధాంతరంగా చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు గ్రూప్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశాలకు వెయిటేజ్ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

ఈశ్వరయ్యను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఐసిడిఎస్ పరిధి కమలాపురం ప్రాజెక్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఈశ్వరయ్యను సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు రెడ్డి, మనోహర్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా విధులు కమలాపురం, నివాసం కడప, ఎప్పుడు చూసినా పీడీ ఆఫీసులో ఉంటారని తెలిపారు. గతంలో ఈ విషయం కడప పీడీ దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. ఆయన అవినీతికి అంతం లేదని తెలిపారు. ఉద్యోగోన్నతులైనా, బదిలీలైనా, కొత్త పోస్టులైనా డబ్బులు ఇవ్వందే ఫైళ్లు ముందుకు కదలదని తెలిపారు. ఇవ్వకపోతే ఏదో ఒక కొరివేసి వాటిని పెండింగ్‌లో పెడతారని తెలిపారు. వర్కర్ల మధ్య ఘర్షణ పెట్టి, గొడవలు సృష్టించి, ఆయన అనుకున్నవారికి వెంటనే ఉద్యోగోన్నతలు, బదిలీలు చేసేస్తారని పేర్కొన్నారు. ప్రశ్నించిన వారిని వేధింపులు, మానసిక క్షోభకు గురి చేస్తారని తెలిపారు. ఆయన చేస్తున్న అవినీతి, అక్రమాల పైన ఆర్‌జెడికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పట్టణ మహాసభలను జయప్రదం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్ :

ఈ నెల 19, 20లలో నిర్వహించే సిపిఎం జమ్మలమడుగు పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి జి. ఏసుదాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలలో పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం వెనుకబడిన ప్రాంతాలకు నిధులు నికరజలాలు పరిశ్రమల కోసం రాబోయే కడప జిల్లా మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. మహాసభలో భాగంగా ర్యాలీ, ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని, జిల్లా కమిటీ నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఏ.వినయ్ కుమార్ డి.విజయ్ వై.అబ్రహం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్‌కుమార్

జాబ్‌మేళాలో 21 మంది ఎంపిక

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్ డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మైదుకూరు గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. 57 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 21 మంది ఎంపిక అయ్యారని జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ గ్రామంలోనే ఉద్యోగాలు కావాలని, తక్కువ జీతం అని నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, ప్రారంభంలో కొన్ని ఒడిదుడుకులను ఎదుర్కొని అనుభవాన్ని సంపాదించిన తర్వాత మంచి జీతభత్యాలతో పాటు హోదా కూడా లభిస్తుంది అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి నెల జిల్లాలోని ప్రతి ఒక్క నియోజకవర్గంలో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి డైకిన్ ప్రతినిధి హరి ప్రసాద్, కీర్తన్ ఫైనాన్స్ ప్రతినిధి ఉగ్ర నరసింహులు, టోరా టెక్నాలజీస్ సంస్థ అధికారులు హాజరయ్యారు.

జాతి సమైక్యత కోసం పాటుపడాలి

ప్రజాశక్తి - వేంపల్లె : జాతి సమైక్యత కోసం ప్రతి విద్యార్థి పాటు పడాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా పేర్కొన్నారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులతో డైరెక్టర్ కుమార్ స్వామి గుప్తా జాతీయ సమైక్యతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జాతులు, సంస్కృతులు, మతాలకు మన దేశం నెలవైందని చెప్పారు. విభిన్న దేశంలో జాతీయ సమైక్యత అనేది చాలా అవసరం ఉందన్నారు. సంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను డైరెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుబ్బారాయుడు, గోవర్ధన్, అనిల్ కుమార్‌రెడ్డి, కోటేశ్వరి, తిరుపతి రెడ్డి, ఇందుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు పరిరక్షణ మహాసభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : జమాతే ఇస్లాం హింద్ మైనారిటీ వక్ఫ్ బోర్డుల భూములు కాపాడుకోవడానికి విజయవాడలో ఆదివారం పరిరక్షణ మహాసభ ఏర్పాటు చేస్తున్నామని వక్ఫ్‌బోర్డు పరిరక్షణ సమితి, కన్వీనర్ సలీం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 5 బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నామని, ముందుగా విజయవాడలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి మైనారిటీలు తరలి రావాలని పిలుపు నిచ్చారు. సభకు వచ్చేవారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అబ్దుల్ సమద్, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియంహైస్కూల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను అనకాపల్లి ఎంపీ సి.ఎం రమేష్ ప్రారంభించారు. ఇటీవల ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన అనంతరం తాను చదువుకున్న స్కూల్లో పర్యటించిన ఆయనకు పాఠశాల యాజమాన్యం వాటర్ ప్లాంట్ కోసం విన్నవించారు. స్పందించిన ఎంపీ తన సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో అభివృద్ధి పనులు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వర్షం వస్తే నీరు నిల్వ ఉంటుందని పాఠశాల యాజమాన్యం తెలుపగా పాఠశాలలో సహాయ చర్యలు చేపడతానని, మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఎంపీ హామీ మేరకు విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - కడప

మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ప్రస్తుతించారు. ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రమైన కడపలోని పాత రిమ్స్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అసి కమిటీ మాజీ డైరెక్టర్ ఎం రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ నేతలు అమీద్, జహీర, కమల్, బాబ్జీ పాల్గొన్నారు. **వేంపల్లె :** భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఉక్కు మనిషి సర్దార్ పటేల్‌కు శుక్రవారం పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలిగా రాణిగా ఏడేళ్ల సేవ చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షునిగా పటేల్ పార్టీ పటిష్టతకోసం, విస్తరణ కోసం ఎనలేని కృషిచేశారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్ నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమా రాజా, వెంకటేష్, బద్రి, బాలు సుబ్బ రాయుడు, ఆదిరెడ్డి సుబ్బ రాయుడు,రాజు,రవి,వినయ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న మహ్మద్ అలీఖాన్

ఘనంగా యువనేత మధురెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కడప

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ నాయకుడు మధురెడ్డి 34వ జన్మదినాన్ని శుక్రవారం కడపలో పలువురు అభిమానులు, నాయకులు, స్నేహితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, స్నేహితులు, నాయకులు, ఉన్నతాధికారులు, అభిమానులు ఎంతో మంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిడి జిమ్ మేనేజ్‌మెంట్ బాషా మొహిదిన్,డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, మౌలా,మనోజ్ ,యాకూబ్ , సోహేల్, ప్రకాష్, మన్సూర్,బాబ్జీ పాల్గొన్నారు.

పుట్టిన రోజు సందర్భంగా కేక్ కోస్తున్న మధురెడ్డి

క్రైం కార్నర్

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీనివాస హాల్ థియేటర్ సమీపంలో నవ్యశ్రీ (21) అనే వివాహిత తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. బంధువుల కథనం మేరకు.. పులివెందుల పట్టణం శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న మహేష్ కుమార్ అనే వ్యక్తి స్టేట్ బ్యాంక్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆతనికి సత్యసాయి జిల్లా తలుపుల చెందిన నవ్యశ్రీతో దాదాపు 16 నెలల కిందట వివాహమైంది. ఆతను ఉద్యోగానికి వెళ్లడంతో ఎవరూ లేని సమయంలో నవ్యశ్రీ చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. మధ్యాహ్నం భోజనానికి వచ్చిన మహేష్ ఎంతసేపు తలుపు తట్టినా తలుపు తీయకపోవడంతో ఇంట్లోకి ప్రవేశించి చూడగా అప్పటికే నవ్య శ్రీ ఉరి వేసుకుని మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆత్మహత్యకుగల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆగిన రోడ్డు పనులు-అవస్థల్లో వాహనదారులు

- గోతులుగా మారిన ప్రధాన రహదారులు
- నిత్యం ఏదోక ప్రమాదం
- గాయాలపాలవుతున్న ప్రజలు

ఒకవైపే వేసిన రహదారి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వంలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో హడావుడిగా వేంపల్లెలో నాలుగు లైన్లుల రహదారి, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత ప్రభుత్వం మారడంతో రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రోడ్డు పనులు అర్ధాంతరంగా వదిలేయడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేంపల్లె పట్టణంలో రవాణా వేగాన్ని తగ్గించడానికి కడప - పులివెందుల, గండి రోడ్డుకు సంబంధించి రూ 60.05 కోట్ల వ్యయంతో 3.8 కిలోమీటర్లు మేరకు సిమెంట్ రోడ్డు పనులు చేసేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పట్టణంలో చేపట్టిన నాలుగు లైన్లుల సిమెంట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వైసిపి ప్రభుత్వ పాలనలో రోడ్డు పనులను సిమెంట్ రహదారి 15 మీటర్లుకు గాను. రాకపోకలు సజావుగా సాగడానికి ఒక వైపు 75 మీటర్లు రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పులివెందుల రోడ్డులోని ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి 3.8 కిలోమీటర్లు గాను దాదాపు ఒక వరుస రహదారిని పులివెందుల ఎన్‌టిఆర్ సర్కిల్ సమీపం నుంచి శ్రీరామ్ ఫైనాన్స్ వరకు రహదారి నిర్మాణం చేపట్టారు. నిర్మించిన రహదారిలో కూడా అక్కడక్కడ పనులు నిలిపేశారు. మరో పక్క కంకర మాత్రం పరిచారు. దాదాపుగా 5నెలలు నుండి రహదారి పనులు జరగక పోవడం వల్ల కంకర పరిచిన రహదారిలో పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇప్పటి వరకు సుమారు 1.490 మీటర్లు ఒక వైపు రహదారిని నిర్మించారు. ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో గుంతల్లో వాహనాలు నడపలేక దుమ్ము, దూళితో వేంపల్లె పట్టణ వాసులు కాలుష్య బారిన పడుతున్నారు. దీంతో శ్వాసకోస సమస్యలు ఎదరువుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసనప్పుడు నీరు గోతుల్లో నిలిచి వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై నీరు పడుతోంది. అలాగే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. రోడ్లు గుంతలుగా మారడంతో వాహన దారులు ఆ రహదారిలో ప్రయాణించాలంటే జంకు తున్నారు. ప్రధాన రహదారి వేంపల్లె పట్టణంలోని పులివెందుల నుంచి కడప రోడ్డులో గుంతలు గోతులాగా ఏర్పడ్డాయి. వాహనదారులు పులివెందుల, కడప రోడ్డున వెళ్లాలంటే ఇతర వీధి మార్గంలో ఉన్న మంచి రోడ్డును వెతుక్కుంటూ పోవాల్సివస్తుంది. కడప - పులివెందుల రోడ్డులో 27 శాతం, గండి రోడ్డులో 40 శాతం పనులు జరిగాయి. కడప - పులివెందుల రోడ్డు మార్గంలో రోడ్డు పనులు చేసేందుకు రూ.47 కోట్లు మంజూరు కాగా, గండి మార్గంలో రోడ్డు పనులు చేసేందుకు రూ.13.05 కోట్లు ఎండిఆర్, ఎస్‌హెచ్ కింద నిధులు అయ్యాయి. కాంట్రాక్టర్‌కు కూటమి ప్రభుత్వం రూ. 7కోట్లు నిధులు మంజూరు చేసింది. పనులు జరగక పోవడంతో ఈ దారిలో చిన్నవాహనాలు ప్రమాదాలు గుర్రైవుతున్నాయి. వాహన ప్రమాదం జరగకుండా అరికట్టేందుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి

వేంపల్లెలో అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి ప్రయాణికుల కష్టాలను తొలగించాలి. ప్రభుత్వం మారడం, రోడ్డు పనులు నిలిచి పోవడంతో దుకాణాదారులతో పాటు ప్రయాణికులు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపాలి.

- బాలం సుబ్బరాయుడు, వేంపల్లె.

పది రోజుల్లోగా పనులు చేపడుతాం

పట్టణంలో నిలిచిన రోడ్డు పనులను 10 రోజుల్లోగా చేపడుతాం. ఇప్పటికి వరకు 27 శాతం పనులు పూర్తయ్యాయి. పనులు త్వరగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లతో సంప్రదిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు చేపడుతున్నాం.

- వేణుగోపాల్, డిఇ, రోడ్డు భవనాల శాఖ.

ఉద్యోగోన్నతులు సజావుగా నిర్వహించాలి :యుటిఎఫ్

ప్రజాశక్తి- కడపఅర్బన్ : మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు సజావుగా నిర్వహించేలా విధంగా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిఇఒ మీనాక్షిని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను యుటిఎఫ్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన విద్యార్హతల విషయంలో ఉన్న సందిగ్ధత తొలగించి అర్హత కలిగిన అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అపార్ నంబర్ జనరేట్ చేయడంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఖాళీగా ఉన్న సబ్జెక్టులకు ఉపాధ్యాయులను సర్దుబాటు ప్రక్రియ ద్వారా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్య దర్శులు సి.వి. రమణ చెరుకూరి శ్రీనివాసులు, ఏజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుపాల్గొన్నారు.

క్రీడా రంగంలో ముందుండాలి : జెవివి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు: విద్యార్థులు చదువుల్లోనేగాక క్రీడారంగంలోనూ ముందుండాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ అనిబిసెంట్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం క్రికెట్ ఆటలపోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడడం వల్ల విద్యార్థుల మేధస్సు శరీరవం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటాయన్నారు. క్రీడాస్ఫూర్తి పెరగాలన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం డేవిడ్‌రాజ్, సురేష్, కృష్ణ జయరాజ్, సోహేల్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యంకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి- కడప అర్బన్ :

యోగి వేమన విశ్వవిద్యాలయం అనువర్తిత గణిత శాస్త్ర పరిశోధకుడు పరాల వెంకట సుబ్రహ్మణ్యంకు అనువర్తిత గణిత శాస్త్ర (అప్లయిడ్ మ్యాథ్స్) విభాగంలో విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రొఫెసర్. జి. కాత్యాయని పర్యవేక్షణలో అప్లయిడ్ మ్యాథ్స్‌లో 'కన్వెక్టివ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్లో ఆఫ్ నానోఫ్లూయిడ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ప్రొఫెసర్. కె.ఎస్.వి.కృష్ణారావు ప్రకటించారు. సుబ్రహ్మణ్యంను వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య. పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, అనువర్తిత గణిత శాస్త్ర ఆచార్యులు, డా. పి. సరిత అభినందించారు.

త్యాగానికి ప్రతీక పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి-చాపాడు

త్యాగానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు అని నరహరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నరసింహ శాస్త్రి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు చిత్రాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ ఏర్పడిందన్నారు. నేటి తరానికి ఆయన ఆదర్శమన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామసుందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **దువ్వూరు :** మండల కేంద్రమైన స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, కార్యక్రమంలో, అరవీటి సుబ్బారావు, అరవేటి నాగేశ్వరరావు, ఈపూరి సత్యనారాయణ, బచ్చు సత్యనారాయణ, కొప్పోలు కిషోర్, తదితరులు వాసవి క్లబ్ సభ్యులు ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. **మైదుకూరు(చాపాడు):** మైదుకూరు అమ్మవారిశాలలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సూరిశెట్టి ప్రసాద్‌గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైదుకూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో అమ్మవారి శాల నుంచి మార్కెట్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ కూడలిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి దొంతు సునీల్, కమిటీ సభ్యులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామమోహన్ , ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, పట్టణంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

వాటర్ గ్రిడ్ పనులు సత్వరం పూర్తిచేయండి

- జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

ప్రజాశక్తి- లింగాల

గ్రామీణ ప్రాంత ప్రజలు భవిష్యత్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు వాటర్ గ్రిడ్ నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేయాలని జడ్‌పి సిఇఒ ఓబులమ్మ అధికారులను ఆదేశించారు. సూమారు రూ. 480 కోట్ల నిధులతో చేపట్టిన వాటర్ గ్రిడ్ నిర్మాణ పనులలో భాగంగా మండల పరిధిలోని పార్నపల్లె గ్రామంలో ని పెంచిక బసిరెడ్డి జలాశయం వద్ద జరుగుతున్న వాటర్ గ్రిడ్ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు పనులు ఎంత శాతం పూర్తి అయ్యాయి, వాటి నాణ్యతను పలు అంశాలపైన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటర్ గ్రిడ్ నిర్మాణాలు పూర్తి అయితే పులివెందుల నియోజకవర్గంలోని 299 గ్రామాలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయవచ్చుని పేర్కొన్నారు. ఇప్పటికే 65 శాతం నిర్మాణాలు పూర్తిచేశామని, నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం పార్నపల్లె బృహత్తర నీటి పథకం నుంచి సమగ్ర గ్రామీణ మంచి నీటి సరఫరా పథకం నుంచి 34 గ్రామాలకే నీరు అందుతుందని చెప్పారు. వాటర్ గ్రిడ్ పనులు పూర్తి అయితే నియోజకవర్గంలోని 7 మండలాలకు నీటి సరఫరా చేసుకోవచ్చు అన్నారు అనంతరం ఎంపిడిఒ కార్యాలయంని సందర్శించారు. కార్యాలయ సిబ్బంది జెడ్పీ సిఈఓ సన్మానించారు కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఇగ్బాల్, ఇఇ విజయభాస్కర్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

ఉక్కు పరిశ్రమను నిర్మించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విభజన హామీలు భాగంగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమల బి.నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరువు సీమను అశ్రద్ధ చేయవద్దని తెలిపారు. రెండు దశల్లో సుమారు రూ.70 వేల కోట్లతో అనకాపల్లిలో నిర్మించతలపెట్టిన ఉక్కు పరిశ్రమ 20 మిలియన్ టన్నులకు పైగా సామర్థ్యంతో సుమారు 90 వేలకు పైగా ఉపాధి కల్పిస్తుందని పేర్కొన్నారు. అత్యల్ప వర్షపాతం కలిగి నిరంతరం కరువుతో అల్లాడుతూ ఇతర ప్రాంతాలకు వలస మార్గాలు ఎన్నుకుంటున్న రాయలసీమ ప్రజల అభివృద్ధికి ఉపయోగపడే కడప జిల్లా ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి తిలోదకాలు ఇవ్వడాన్ని రాయలసీమ ప్రజలు తీవ్రంగా ఖండించాలని తెలిపారు.

శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానము
(శివాలయము)
ప్రొద్దుటూరు టౌన్ (మం), కడప జిల్లా

ప్రకటన

దేవదాయశాఖ. శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము, ప్రొద్దుటూరు నందు కార్తీక మాస ఉత్సవములలో 4 సోమ వారములకు, పౌర్ణమికి జరుపునపుడు, లైటింగ్ డెకరేషన్ 400 సీరియల్ లైట్స్, 20 day లైట్స్, 20 ఫోకస్ లైట్స్ 20 లైటింగ్ బోర్డ్స్, క్యూలైన్ కొరకు ఐరన్ బ్యారీ గేట్స్ 30, ఏర్పాటు చేయుటకు వాటికి ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు 7.10.2824 వ తేది సాయంత్రం 5-00 గం,,లలోపు కార్యనిర్వహణాధికారి శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము కార్యాలయము నందు అందజేయవలసినదిగా కోరడమైనది.

కె.రామచంద్రాచార్యులు, M.A., B.Ed.,
కార్యనిర్వహణాధికారి
శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానము
దేవదాయశాఖ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT PRODDATUR
I.P.NO. 45/2021

1. L.Subbarami Reddy ...Plaintiff/Petitioner

Vs

2. L.Veeraprathap Reddy and others ...Defendants/Respondents

NOTICE

పై నెంబరు కేసులో పిటిషనర్‌ను ఇన్‌సాల్వెంట్‌గా తీర్మానించమని పిటిషన్ దాఖలు చేసి యున్నారు. అట్టి పిటిషన్‌పై రెస్పాండెంట్స్ అయిన మీకు ఆక్షేపణలు ఉన్న యెడల 07.11.2024 తేదీన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు నందు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా హాజరై తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది : 07.11.2024, ప్రొద్దుటూరు

"మహారాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు"

B. NARAYANA REDDY, B.Com., B.L.,
Advocate, Proddatur

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని కీర్తి శేషులు, మాజీ మండలాధ్యక్షులు కర్నాటి శివారెడ్డి వర్ధంతి వేడుకల సందర్భంగా ఓబులాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద అనాథాశ్రమంలో శుక్రవారం ఆయన కుమారుడు బద్వేలు తెలుగుదేశం పార్టీ నాయకుడు కర్నాటి వెంకటరెడ్డి, తెలుగుదేశం పార్టీ కడప మాజీ పార్లమెంటు మహిళా అధ్యక్షులు కర్నాటి శ్వేతా రెడ్డి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నాటి శివారెడ్డి కాశినాయన మండల వ్యవస్థాపకులుగా కీర్తి పొందారని చెప్పారు. ఆయన మండల వాసులకు ఎంతో సేవ చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన అడుగుజాడల్లోనే తాము నడుస్తూ ప్రజలకు సేవ చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తాము వారి ఇంటి వద్దకే వెళ్లి పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నరసాపురం మాజీ సర్పంచ్ కె.వి సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ నాగేంద్రరెడ్డి, భీమయ్య, శేషారెడ్డి మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సాపురంలో శివారెడ్డి అభిమానులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న దాతలు

ఎంపిడిఒను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎంపిడిఒకు టిడిపి నాయకుల సన్మానం

ప్రజాశక్తి -ఖాజీపేట

మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ దివిజ సంపతిని శుక్రవారం కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. పంచాయితీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని వారు ఈ సందర్భంగా ఆమెను కోరారు. కార్యక్రమంలో భూమాయ పల్లి గ్రామ సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, టిడిపి బిసి సెల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి తుట్టె రాము యాదవ్, మామిళ్ళ సుబ్బారెడ్డి, దాసరి రవి ప్రసాద్ యాదవ్, దాసరి చిన్న గంగన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ పి. విజయకుమారి

ఆర్‌హెచ్, ఇసి భూ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - చక్రాయపేట : భూ సమస్యలు పరిష్కారం కావాలంటే ఆర్‌హెచ్ (రికార్డ్ ఆఫ్ ఓల్డ్) లేదా మాన్యువల్ ఇసి ఒక్కటే మార్గమని తహశీల్దార్ పి.విజయ కుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చక్రాయపేట సచివాలయం వద్ద రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కారం కోసం సమాఇవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం కావాలంటే ఇసి లేదా ఆర్‌హెచ్ రెండింటిలో ఏదో ఒకటి తీసుకొస్తే వేణు వెంటనే పరిష్కారం చేస్తామని ఆమె తెలిపారు. గతంలో జరిగిన ఈ సర్వేలో భాగంగా కొందరికి ఎక్కువగా భూమి వచ్చిందని, కొందరికి భూమి తగ్గిందని, ఇంకొందరేమో తమ తల్లిదండ్రులు చనిపోయారు ఆ భూమిని మా పేరిట ఎక్కించమని, తదితర సమస్యల పైన దాదాపు 40 దరఖాస్తులు సమర్పించారని చెప్పారు. సరైన పత్రాలు తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

ఆశాజనకంగా వరి పంట దిగుబడులు

ప్రజాశక్తి - చక్రాయపేట : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ఆశాజనంగా దిగుబడి వచ్చిందని వ్యవసాయ అధికారి నవంత్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం అద్దాలమర్రి, కుమార కాల్వ గ్రామంలో 2024 సీజనకు గాను, గణాంక శాఖ వారు నిర్ణయించిన ఇచ్చిన సర్వే నెంబర్లలో పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. 5.5 చదరపు మీటర్లలో 16.750 కిలో వరి దిగుబడి వచ్చినగ్లు తెలిపారు. ఒక ఎకరానికి 80 కిలోల బస్తాలు, 32 నుండి 34 బస్తాల దిగుబడి వచ్చిందని తెలిపారు. కుమార కాల్వలో 5.5 చదరపు మీటర్లకు 15.450 కిలోలు, ఎకరానికి 32 బస్తాలు దిగుబడి వచ్చినట్లు పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు సరిగ్గా లేకున్నా, వర్షాల వల్ల పంటలో పురుగుల ఉధృతి తక్కువ ఉన్నందున, పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ వారు ఖాదర్ వలి, మండల వ్యవసాయాధికారి నవంత్‌బాబు, రైతు సేవ కేంద్ర సహాయకులు పార్వతి, గ్రామ రెవెన్యూ సహాయకులు, నాగయ్య, రైతులు పాల్గొన్నారు.

చతికిలపడ్డ సాగునీటి రంగం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : వైసిపి, టిడిపి పాలనలో సాగు నీటి రంగం చతికిల పడిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రం అన్నారు. అలాంటి వ్యవసాయ రంగానికి సాగునీటి రంగం గుండెకాయ లాంటిదని చెప్పారు. ఈ సత్యాన్ని గ్రహించి కాంగ్రెస్ ప్రభుత్వాలు బడ్జెట్ లో సాగునీటి రంగానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. బడ్జెట్‌లో సాగునీటి రంగానికి 15 నుండి 17 శాతం నిధులు కేటాయించి ఖర్చు చేశారన్నారు. దురదృష్టవశాత్తూ టిడిపి, వైసిపి ప్రభుత్వాలు సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. బడ్జెట్ లో సాగునీటి రంగానికి 15 శాతం నిధులు కేటాయించి ఖర్చు పెట్టాలని కోరారు.

ఇంజినీరింగ్ ఫీజులను తగ్గించాలని వినతి

ప్రజాశక్తి- కడప అర్బన్ : ప్రొద్దునూరు పట్టణంలోని వైవీయూ ఇంజినీరింగ్ కళాశాలలో 1 నుంచి 4 సెమిస్టర్ వరకు పరీక్ష ఫీజు రూ.2,500 ఉందని, వెంటనే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యోగి వేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న యోగివేమన ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు సంబంధించి రూ.2500 ఫీజును తగ్గించాలని, లేకపోతే పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారన్నారు. వారి కుటుంబం రోజు పనిచేస్తే గాని గడవని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. వెంటనే ఫీజులు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్, ఉదయ్ పాల్గొన్నారు.

శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, ప్రొద్దుటూరు
I.A.No. 1052/2021
O.S.No. 679/2021

దేగల యేసేబు, తండ్రి మార్కు వయస్సు 58 సం॥, డో.నెం.4/71, కొర్రపాడు గ్రామం, రాజుపాలెం మండలం, కడప జిల్లా.

వర్సెస్

డి. 2: జి.బ్రహ్మం, తండ్రి మస్తాన్ 48 సం॥ హరి మెడికల్ షాపు, కేర్ ఫార్మసీ, కె.వి.ఆర్.హాస్పిటల్ ఎదురుగా, గాంధీరోడ్డు, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

దావా సమన్సు

పై నంబరు దావా షెడ్యూలు ఆస్తిపై వాది అయిన నేను రెండవ ప్రతివాది (ఆర్2) (డి2) అయిన మీ పైన ఇంజంక్షన్ ఆర్డరు కోరకు పై కోర్టులో దావా దాఖలు చేయగా రాజశ్రీ కోర్టువారు ప్రతివాది అయిన మీకు I.A.No. 1052/2021, O.S.No. 679/2021, 06.11.2024వ తేదీన ఉదయం 10:30 గం॥లకు హాజరై రెండవ ప్రతివాది అయిన నువ్వు నీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. అట్టు లేని యెడల కోర్టువారు మీపైన తదుపరి ఉత్తర్వులు పాలించెదరు.

"మహారాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు"

DARA OBULESU, B.A.,B.Ed., LLB.,
Advocate, Proddature